సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 6 | మార్చి | 2023



మహిళా అభ్యున్నతికి కృషి

మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో



శాంతిభద్రతలు క్షీణించాయి

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
37.0°/19.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన టీఎస్‌పీఎస్సీ పరీక్షలు



హన్మకొండ అర్బన్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న ఏఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 8,245 మంది అభ్యర్థులకు ఉదయం పరీక్షకు 6,522 మంది(79.10 శాతం), సాయంత్రం పరీక్షకు 6,483 మంది(78.63 శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు. మొత్తం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలను అదనపు కలెక్టర్ సంధ్యారాణి పర్యవేక్షించారు.

నేడు కాకినాడ ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక్కరోజు రద్దు చేస్తున్నట్లు ప్రకటించినట్లు కాజీపేట రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. కాజీపేట-కాకినాడ మార్గంలో ఇంజనీరింగ్ పనుల కారణంగా కాకినాడ-సికింద్రాబాద్(07759) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

8 వరకు ఫార్మసీ పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కేయూ బీఫార్మసీ(సీబీఎస్) మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 8వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఆదివారం తెలిపారు. అలాగే ఎంఫార్మసీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రూ.250 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 8 వరకు గడువు ఉందని వారు పేర్కొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిసూర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతీ సోమవారం జరిగే పోలీస్ గ్రీవెన్స్ రద్దు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారుల సమావేశం ఉన్నందున గ్రీవెన్స్ రద్దు చేశామని, ఫిర్యాదుదారులు కార్యాలయానికి రావద్దని సీపీ సూచించారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



కాజీపేట: చైతన్యపురి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు చివరి రోజు పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నదీ జలాలతో వేదపండితులు చక్రస్నానం చేయించారు. సప్త బావులు, సప్త నదీ జలాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. భక్తుల కోలాహలం మధ్య ఉత్సవమూర్తులతో పండితులు నృత్యాలు చేశారు. వేదపండితులు డాక్టర్ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న గణపతి హోమానికి పండితులు, భక్తులతో కలిసి కనుల పండువగా పూర్ణాహుతి నిర్వహించారు. కాలనీ మహిళలు, పిల్లలు సామూహిక భక్తి గీతాలను ఆలపించారు. 12 రకాల పదార్థాలను స్వామి వారికి భక్తులు నైవేద్యంగా సమర్పించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తిచేసిన పండితులు, బ్రాహ్మణోత్తములు, సన్నాయి మేళాలు వాయించిన కళాకారులకు దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డేపల్లి నరేందర్ నూతన వస్త్రాలు, కానుకలు అందజేసి సన్మానించారు.

ఆగని ఆక్రమణలు

గ్రేటర్ వరంగల్ చుట్టూ రియల్ దందా..

- చెరువులు, ఎస్సారెస్పీ భూములను వదలని కబ్జాదారులు
- ఆక్రమణపై స్పందించని ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖలు
- సీపీ, కలెక్టర్‌ల హెచ్చరికలు బేఖాతరు







ఎస్సారెస్పీ కెనాల్ పక్కన భీమారం-హసన్‌పర్తి సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు

సాక్షి ప్రతినిధి, వరంగల్: కబ్జాదారుల కన్నుపడితే చాలు ఏ భూమి అయినా సరే వారి కబంధహస్తాల్లోకి వెళ్తున్నాయి. ఎకరాలకొద్దీ ఉన్న చెరువులు, కుంటలు చిక్కి శల్యమవుతున్నాయి. గ్రేటర్ వరంగల్ చుట్టూ ఆక్రమణల పరంపర కొనసాగుతున్నా.. అధికారులు మౌనం వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇరిగేషన్ భూముల్లో రియల్టర్లు దర్జాగా ప్లాట్లు చేసుకుని విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు. హసన్‌పర్తి మండలం భీమారంలోని శ్యామల చెరువు, దేవన్నపేట, జయగిరి, అన్నాసాగరం, వంగపహాడ్, హసన్‌పర్తిలోని చౌదరికుంట చెరువులు కబ్జాకు గురయ్యాయి. వీటిలో వెంచర్లు చేసి విక్రయాలు కూడా చేపట్టారు. ఇదే క్రమంలో ఎస్సారెస్పీ కెనాల్ పక్కన విలువైన భూములను కబ్జా చేసి విక్రయిస్తున్నా.. ఎవరికీ పట్టడం లేదు.

ఎస్సారెస్పీ భూముల కబ్జా

చెరువులు, కుంటలే కాదు.. ఎస్సారెస్పీ భూముల్లో సైతం వెంచర్లు చేయడంతోపాటు నిర్మాణాలు వెలిశాయి. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయ సమీపంలోనే సుమారు పదెకరాల మేరకు భూమిని కబ్జా చేసి ప్రహరీలు కూడా నిర్మించారు. దీనిపై అధికారులకు మౌఖికంగా, లిఖితపూర్వకంగా ఫిర్యాదులు కూడా అందాయి. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వరంగల్ నగరాన్ని ఆనుకుని ఉండటంతో ఎస్సారెస్పీ భూములకు మంచి ధర పలుకుతోంది. గజానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ధర ఉంది. కోట్లాది రూపాయల విలువైన భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా.. భీమారంలోని శ్యామల చెరువు 30 ఎకరాల మేర కబ్జాకు గురైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు తేల్చినప్పటికీ ఇప్పటివరకు ఉన్నతాధికారులకు నివేదిక అందించలేదు. వారం రోజులవుతున్నా నివేదిక అందించకపోవడం పట్ల స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల వల్లే నివేదిక నిలిచిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేస్తే స్పందించని పోలీసులు

ఎస్సారెస్పీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కేయూసీ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్లలో పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని చెబుతున్నారు. కాగా.. సర్కారు భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ, కలెక్టర్లు హెచ్చరించినా అక్రమార్కుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

పదేళ్ల క్రితమే హద్దులు

కాగా.. పదేళ్ల క్రితమే ఎస్సారెస్పీ భూములను సర్వే చేశారు. ఇందులో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారు. అప్పటి జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎస్సారెస్పీ భూములు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు మహిళా సంఘాలకు కూరగాయల సాగుకు కేటాయించారు. అందులో బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా ఈ పనులు చేపట్టారు. అయినా యథేచ్ఛగా సాగుతున్న ఆక్రమణలు, అమ్మకాలపై చర్యలు లేవు.

ఠాణాలో ఫిర్యాదు చేశాం..

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరికలు చేశాం. ఆక్రమణలకు అవకాశం లేకుండా చుట్టూ ఖనీలు ఏర్పాటు చేశాం. ఎస్సారెస్పీ, చెరువుల భూముల కబ్జాపై పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఈ విషయంలో పోలీసులు మాత్రం సహకరించడం లేదు.

– సీతారాంనాయక్, ఈఈ, జలవనరుల శాఖ

రూ.25కోట్ల నిధులు కావలెను!

- పంపిణీలో మార్పులు చేస్తే రోజూ నీళ్లు
- ఎట్టకేలకు నిపుణుల కమిటీ నివేదిక



వరంగల్ అర్బన్: మహా నగరంలో క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై నిపుణుల బృందం అధ్యయనం చేసిన విషయం విదితమే. నగర ప్రజలకు రోజూ తాగునీరు ఇవ్వాలంటే వివిధ పనుల నిమిత్తం రూ.25కోట్ల నిధులు అవసరం ఉందని తేల్చి చెప్పారు. ఎట్టకేలకే బృందం జల ప్రణాళికను రూపొందించి పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులకు నివేదించింది. రెండు దశాబ్దాలుగా నగరంలో తాగునీటి వ్యవస్థ బలోపేతం కోసం రూ.వేల కోట్లు వెచ్చించారు. సమృద్ధిగా రిజర్వాయర్లలో నీటి నిల్వలున్నాయి. అయితే నీటి శుద్ధికి కావాల్సిన మేరకు ఫిల్టర్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, రిజర్వాయర్లు ఉన్నాయి. సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉన్నప్పటికి రోజూ నీళ్ల ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఆదేశాలతో హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు రిటైర్డ్ ఇంజనీర్ రవికుమార్, ముగ్గురు నిపుణుల బృందం వరంగల్ వచ్చి వాస్తవ పరిస్థితులపై అధ్యయనం చేసింది. నగరంలోని 66 డివిజన్లలోని అన్ని కాలనీల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి లాస్ట్ కనెక్టివిటీ వరకు తాగునీటి సరఫరా వ్యవస్థపై పూర్తిస్థాయిలో పరిశీలించారు. మెయిన్ పైపులైన్లు, ఫిల్టర్‌బెడ్లు, పంపింగ్ మోటార్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, రిజర్వాయర్లు, పైపులైన్ వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక తయారు చేశారు. ఇదిలా ఉండగా.. బల్దియాను నిధుల కొరత వేధిస్తోంది. రూ.25కోట్లు ఒకేమారు వెచ్చించడం ఇప్పటికిప్పుడే సాధ్యమయ్యేలా కనిపించడం లేదని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. తొలుత రూ.5కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, క్రమేపీ ఇతర పనులు పూర్తి చేయాలని సమాలోచనలు చేస్తున్నారు.

ఇలా మార్పులు చేయాలి..

- అమృత్, మిషన్ భగీరథ పైపులైన్లకు, గతంలో ఉన్న పైపులైన్ల అనుసంధాన ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగాలి. గతంలో కొన్ని ప్రాంతాల్లో అమర్చిన తాగునీటి పైపులైన్లను తీసి.. సక్రమమైన మార్గంలో మార్పులు చేయాలి.
- కొన్ని కాలనీల్లో కొత్తగా పైపులైన్లు ఏర్పాటు చేయాలి.
- కొన్ని ఎత్తయిన, శివారు ప్రాంతాల్లో, లాస్ట్ కనెక్టివిటీ వరకు నీటి ప్రెషర్ తక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రణాళికాబద్ధంగా తొలుత ఆయా ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలి. తదుపరి ఇతర ప్రాంతాలకు నీటిని వదలాలి.
- ఫిల్టర్‌బెడ్ల నుంచి తాగునీటిని మళ్లించేందుకు వాల్వ్‌లే కీలకం. ఒక విధంగా చెప్పాలంటే ఆన్ అండ్ ఆఫ్ సిస్టమ్ లాంటిది. ట్రంక్ మెయిన్ పైపులైన్ల అనుసంధానంగా ఉన్న పాతకాలం నాటి ఎయిర్ వాల్వ్‌లు, స్లూస్ వాల్వ్‌లు మార్చాలి.
- మోటార్ల సామర్థ్యం పెంచాలి.
- పైపులైన్ల లీకేజీల ద్వారా రోజు 30 శాతం తాగునీరు వృథాగా పోతున్నాయి. చిన్నా, పెద్ద పైపులైన్ల లీకేజీలతో 35 ఎంఎల్‌డీల నీళ్లు మట్టిపాలవుతున్నాయి. 30 కాలనీలకు సరిపడా నీరు పనికిరాకుండా పోతోంది. అరికట్టేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలి.
- అనధికారిక నల్లాలను క్రమబద్ధీకరించాలి.
- రిజర్వాయర్ల వద్ద కాలనీలకు టైమర్లను ఏర్పాటు చేయాలి.
- ప్రతీ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసేందుకు శిక్షణ తీసుకున్న సిబ్బంది అవసరం.

ఎర్రగట్టు జాతరకు సర్వం సిద్ధం

ప్రభుత్వంపై యుద్ధమే..

మహిళలపై వివక్ష కొనసాగుతోంది

హృదయంపై అప్రమత్తంగా ఉండాలి

- వివరాలు 10లో

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



యోగా ఆచరిస్తున్న విద్యార్థులు, యువత

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ కల్చరల్: ఒత్తిళ్ల నుంచి దూరం కావడానికి నిత్యం యోగా చేయాలని, దాంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హార్ట్ ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన యోగా మహోత్సవ కార్యక్రమం ఆదివారం ముగిసింది. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వినయ్‌భాస్కర్ పాల్గొని మాట్లాడారు. యోగా శిక్షణ వరంగల్‌లో నిర్వహించడం వల్ల నగరవాసులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. మూడు రోజులపాటు యోగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు తమ అనుభూతులను వివరించారు. నగర ప్రజలు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించి తగిన మెళకువలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, రామచంద్రమిషన్ యోగా నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ప్రతిభా' పరీక్ష

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల 33 ప్రతిభా కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం(2023–24) ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ రీజియన్‌లోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు 16 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ అడ్మిషన్ల ప్రవేశ పరీక్షకు 6,085 మంది హాజరు కావాల్సి ఉండగా.. అందులో 5,725 మంది విద్యార్థులు(94.08 శాతం) హాజరయ్యారని ఆర్సీఓ విద్యారాణి తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించారని తెలిపారు. ఇక డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు వరంగల్ రీజియన్‌లో 1,728 మంది అభ్యర్థులకు.. 1,611 మంది(93.4 శాతం) హాజరయ్యారని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాయనుండగా.. అందుకు 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. కాగా.. పలు పరీక్ష కేంద్రాలను సాంఘిక సంక్షేమ గురుకులాల వరంగల్ రీజియన్ కోఆర్డినేటర్(ఆర్సీఓ) విద్యారాణి సందర్శించి.. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఆర్సీఓ విద్యారాణి

కొర్రీల 'కిరణం'!

'రేటు' చెప్పాకే స్లాట్ బుక్ చేయాలి

- లేదంటే అక్కడ రిజిస్ట్రేషన్ చేయరు
- గ్రామాల్లో ఏజెంట్లను పెట్టి మరీ అక్రమాలు
- వారితో వస్తేనే ఆ తహసీల్‌లో పని సులువవుతుంది



హన్మకొండ అర్బన్: అదో తహసీల్దార్ కార్యాలయం. కానీ.. అక్కడ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెళితే పనులు కావు. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్, నాలా.. ఇలా ఏ పని కావాలన్నా స్లాట్ బుక్ చేసుకుని వెళితే ఫైల్‌ను విసిరి కొడతారు.. అవసరమైతే బయటకు గెంటేస్తారు. కార్యాలయ చుట్టుపక్కల మీసేవ కేంద్రాలు కూడా ఆయన కనుసన్నల్లోనే పని చేయాలి. అదీ అక్కడి ప్రత్యేకత. ఇక బయటకు వెళ్లిన తర్వాత ఉంటుంది అసలు కథ. సార్.. మనుషులు రంగంలోకి దిగి 'బయటకు వెళ్లిన' వారితో పనికో రేటు మాట్లాడుకుని.. మీరు అన్నింటికీ ఓకే అంటే క్షణాల్లో పని పూర్తవుతుంది అంటూ పనులు చక్కబెడుతున్నారు.

ఊరికో ఏజెంట్..

నేరుగా కాకుండా తన ప్రైవేటు ఏజెంట్ల ద్వారా సార్ పనులు చేస్తుంటారు. గ్రామాల్లో ఒకరిద్దరిని తన ఏజెంట్లుగా పెట్టుకుంటారు. వారి ద్వారా వెళితేనే పనులు చేస్తారు. లేదంటే కొర్రీలు పెట్టి ఫైల్ పక్కన పెట్టడంలో సార్ దిట్ట అనే ప్రచారం ఉంది. ఇక్కడి కార్యాలయంలో బాధితులు ఒకరిద్దరు కాదు ఊరికి పది మంది వరకు ఉన్నారు.

అన్నా.. సార్‌ను కలిశావా..

తహసీల్‌లో పనికోసం తిరిగే బాధితులతో సార్‌కు సంబంధించిన ఏజెంట్లు నేరుగా లేదా ఫోన్ ద్వారా మాట కలుపుతారు. పనిలోపనిగా 'అన్నా.. సార్‌ను కలిసినవా.. నాకు చెబితే అయిపోవు కదా..' అంటూ లైన్ కలుపుతారు. పని విషయంలో కొర్రీలు మొత్తం వాళ్లే మీకు వివరిస్తారు. ఆ పని చేయడానికి ఓ రేటు ఫిక్స్ చేసి చెబుతారు. దానికి ఓకే అంటే పని అవుతుంది.. లేదంటే మీ ఖర్మ.

ఎకరాల్లో ఉంటే మరో దందా..

ఇక ఎకరాల్లో ఉన్న వాటి లావాదేవీల తతంగం మరోలా ఉంది. ఉదాహరణకు.. ధర్మసాగర్ ప్రధాన రహదారి వెంట ఓ రైతుకు చెందిన సుమారు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. దానికి ఏపీ, తెలంగాణకు సంబంధించి పాస్‌బుక్‌లు ఉన్నాయి. అందులో కొంత భూమి రోడ్డు విస్తరణలో పోయింది. మిగతా భూమిని నాలా కన్వర్షన్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే దానికి నానా కొర్రీలు పెట్టి పంచాయితీ సృష్టించే పని చేశారు. వ్యవహారం చక్కబెట్టాలంటే ఓ ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ చేయించాలని అన్నారు. అంతేకాదు.. పని కావాలంటే ఓ ట్రస్ట్‌కు పెద్ద మొత్తం విరాళం ఇవ్వాలని చెప్పారు. అయితే విరాళం ఇచ్చినా పని చేయలేదు సరికదా.. కొత్త కొర్రీలు పెట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విసుగు చెందిన సదరు బాధితుడు ఇటీవల కలెక్టరేట్‌లో ఓ సీనియర్ అధికారిని కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. స్లాట్ బుక్ చేసుకున్నాక తహసీల్దార్ ఆపే అధికారం లేదని, గట్టిగా నిలదీయాలని, లేదంటే ఉన్నతాధికారులను కలవమని సదరు అధికారి సలహా ఇచ్చారు. ఇక తన పరిధిలో మొరం తవ్వకాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు, ఇతర వ్యహారాలకు సంబంధించి తీవ్ర ఆరోపణలే ఉన్నాయి. వచ్చే సాధారణ ఎన్నికల వరకు తననెవరూ కదిలించరని ఆయన ధీమా. అందుకు కారణం తనకు ఓ ప్రజాప్రతినిధి అండదండలు, సీఎం కార్యాలయం వరకు పరిచయాలు ఉన్నాయని తన అనుయాయుల వద్ద చెబుతుంటారని ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఆయన పట్ల ఉదాసీనంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది.

ఇవీ లెక్కలు..

ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుందనే ఉద్దేశంతో గతంలో కలెక్టర్ 10 గుంటల భూమికన్నా తక్కువగా ఉన్న వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయవద్దని చెప్పారు.

దీనిని అదునుగా తీసుకుని వసూళ్ల వ్యవహారం మొదలు పెట్టారు. 10 గుంటలలోపు ఉంటే రూ.15వేల నుంచి రూ.20వేలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మొదట కాగితాలతో వస్తే తిప్పి వెళ్లగొడతారు. తర్వాత ఏజెంట్ ద్వారా వస్తే పని పూర్తి చేస్తారు.

- ఇక 2, 3 గుంటల నాలా కన్వర్షన్ చేసుకున్నా ఒక్కో ఫైల్‌కు రూ.15వేలు ఇవ్వాల్సిందే.
- ఇక సక్సేషన్ చేసుకున్న కొద్ది మొత్తం స్థలం కోసం అయినా ఎంతో కొంత ఇవ్వనిదే ఇక్కడ పనికాదు. పాస్ పుస్తకం లేకుండా రిజిస్ట్రేషన్, అమ్మకం, కొనుగోలు చేయాలన్నా ధర చెల్లించాల్సిందే. ఒకవేళ ఏజెంట్ల బాగోతం తెలియక మీరు నేరుగా వెళితే అంతే సంగతులు.
- కొద్ది రోజుల క్రితం భట్టుపల్లికి చెందిన ఓ వితంతువు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి.. తనకు సంబంధించిన భూమి 8 గుంటలు ఇతరులకు అమ్మేందుకు స్లాట్ బుక్ చేసుకుని వచ్చింది. దీంతో ససేమిరా అంటూ వెళ్లగొట్టారు. హైదరాబాద్‌లో ఉంటున్న సదరు మహిళ పదేపదే తిరగలేనని వేడుకుంది. దీంతో రూ.20వేలకు వ్యవహారం సెటిల్ చేసి పనిపూర్తి చేశారు.
- గత నెలలో ఒక వ్యక్తి తన తండ్రి పేరుతో ఉన్న 5 గుంటల భూమి తన పేర మార్చేందుకు సక్సేషన్ బుక్ చేసుకున్నాడు. ముందు ససేమిరా అన్న అధికారులు తర్వాత రూ.15వేలు తీసుకుని పూర్తి చేశారు.
- కడిపికొండకు చెందిన ఓ వ్యక్తి 3 గుంటల నాలా కన్వర్షన్ చేసుకుంటే రూ.25వేల చొప్పున వసూలు చేశారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

కాజీపేట రూరల్: సమాజంలో ఖరీదు కట్టని రక్తదానం మరొకరికి ప్రాణదానమని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఎ.బారీ సూచించారు. కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ప్రాంగణంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వేసవి కాలంలో రక్త సేకరణ కొరత ఉండకుండా తలసేమియా, రక్తహీనతతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈమేరకు 400 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారికి డోనర్ కార్డులు పంపిణీ చేశారు. తొలుత దర్గాను అధికారులు దర్శించుకున్నారు.తర్వాత మైనార్టీ సొసైటీ క్యాలెండర్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా భక్తియార్ బియాబాని, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అనిసూర్ రషీద్, హైదరాబాద్ నుంచి అబు అయిమల్, కాజీపేట సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా, డీసీపీ బారీ తదితరులు

సీపీఆర్‌పై అవగాహన అవసరం

విద్యారణ్యపురి: ఇటీవల కార్డియాక్ అరెస్టులు పెరిగిపోతున్నాయని, ఈ క్రమంలో సీపీఆర్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి సూచించారు. హనుమకొండలో పబ్లిక్ గార్డెన్ వద్ద ఆదివారం సైకిల్ ర్యాలీ ప్రారంభించి రాంనగర్‌లోని డాక్టర్ శ్రీనివాస్ రామక హార్ట్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని కార్డియాక్ అరెస్టు అయినవారిని ఎలా రక్షించుకోవాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి సలహాలిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు అనంత్, రమేష్, వేణు, రాములు, సత్యజయప్రసాద్, రాపర్తి లక్ష్మయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు పీఆర్‌సీ ప్రకటించాలి

హన్మకొండ: పెన్షనర్లకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించి మూడు డీఏలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని శ్రీనిధి స్కూల్‌లో సంఘ వరంగల్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని హితవు పలికారు. ఉద్యోగిగా అనేక సేవలందించి రిటైర్డ్ అయిన తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పెన్షనర్లందరికి రాష్ట్రంలోని అన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించాలని, ప్రతీ నెల మొదటి తేదీన బ్యాంక్ ఖాతాలో పింఛన్ జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన తిరువరంగం ప్రభాకర్, ఉపాధ్యక్షుడు పీఆర్ మోహన్‌ను సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపాద సోమయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, నాయకులు మాదిరెడ్డి మల్లారెడ్డి, పి.లక్ష్మారెడ్డి, జి.కుమారస్వామి, కె.భద్రయ్య, నిజామొద్దీన్, సురేష్, గటిక మల్లయ్య, బి.కేదారి, కొమురయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

క్లుప్తంగా

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ఖిలావరంగల్: ఓ మైనర్ బాలికను అత్యాచార యత్నానికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికను అదే ప్రాంతంలో వెల్డింగ్ పనిచేస్తున్న వ్యక్తికి మధ్య పరిచయం ఏర్పడింది. బాలిక అతడితో తరుచూ మాట్లాడటంతో ఒంటరిగా ఉన్న ఆ బాలికపై అత్యాచారయత్నానికి యత్నించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపగా తల్లి సహకారంతో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ


ఖిలా వరంగల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం వరంగల్ గవిచర్ల గ్రాస్ రోడ్డు సమీపంలో జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం గుడెప్పాడు గ్రామానికి చెందిన మహబూబీ.. కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి కారులో తిరిగి గుడెప్పాడుకు బయల్దేరారు. ఈక్రమంలో వరంగల్ గవిచర్ల క్రాస్‌రోడ్డు సమీపానికి రాగానే కారును ఎదురుగా వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న మహబూబీకి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. క్షతగాత్రురాలిని స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

చంపుతామని బెదిరించిన వారిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన చిందుకూరి ఏడుకొండలును హైదరాబాద్‌కు చెందిన నూనావత్ భూపాల్ నాయక్, మరికొంతమంది కలిసి హత్యచేసి చంపుతామని బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట హ్యాపీ స్టే ఇన్ లాడ్జీని నువ్వు ఎందుకు కొనుగోలు చేశావని ఏడుకొండలును కిసాన్ పరివార్ సంస్థ నిర్వాహకులు భూపాల్ నాయక్, మరికొంతమంది కలిసి చంపుతామని బెదిరించారన్నారు. దీంతో అతడు తనకు ప్రాణభయం ఉందని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై విజయరాంకుమార్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

NATIONAL DENTIST DAY
Chief Dental Surgeon:
Dr. V. Sridhar Reddy
(Professor) MDS
SHRADDHA
DENTAL CLINIC
H.No.6-2-42/1, Kakaji Colony, HANAMKONDA.
Ph: 0870-2458444, Cell: 8499895096.



మహిళల అభ్యున్నతికి సీఎం కృషి

- 8న కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు: మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలను మంత్రి సత్కరించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు స్త్రీ నిధి పథకం ద్వారా రూ. 18 వేల కోట్ల రుణాలు అందించామన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు తేవాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిందని, కేంద్రం మాత్రం నేటికీ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించలేదన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

ఈ నెల 8న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తొర్రూరుకు రానున్నారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి దయాకర్‌రావు కోరారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సభాస్థలి, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను మంత్రి పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 20 వేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు కేటీఆర్ చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్ పంజా కల్పన, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుమర్తి శాంత, పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో మాట్లాడుతున్న మంత్రి

ఎండు గంజాయి పట్టివేత



నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జితేందర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

- మొబైల్ ఫోన్, ఆటో స్వాధీనం
- ఇద్దరు పరార్, ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి

ఖిలావరంగల్ : అక్రమంగా నిల్వ చేసి ఇతరులకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ శివనగర్ ప్రాంతం ఏసీరెడ్డినగర్ చెందిన ములుగు వినయ్, పోచమ్మమైదాన్ వాసవికాలనీకి చెందిన జన్ను ప్రశాంత్, వరంగల్ డాక్టర్ కాలనీ ఫేస్–1, సీపీఎం హట్స్, గౌతంనగర్‌కు చెందిన షేక్ ఫరాజ్, శివనగర్‌లోని సాయిబాబాలేన్‌కు చెందిన పాకాల సాయి, ఏసీరెడ్డినగర్‌కు చెందిన ములుగు వికాస్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు శివనగర్‌కు చెందిన సాయి, విక్కీల నుంచి కొనుగోలు చేసిన ఎండు గంజాయిని సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో 1.200 కిలోగ్రాముల ఎండు గంజాయి లభించింది. పాకాల సాయి, ములుగు వికాస్ ఇద్దరు పరారు కాగా వినయ్, జన్ను ప్రశాంత్, షేక్ ఫరాజ్‌ను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డెబోయిన లవన్‌కుమార్, ఎండీ నిస్సార్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

కాజీపేట: గంజాయికి అలవాటు పడిన ముగ్గురు యువకులను ఆదివారం అరెస్ట్ చేసి ఒక కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ఎస్సై ప్రమోద్ కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనబడగా పోలీసులను చూసి పరార్ కావడానికి ప్రయత్నించారు. యువకుల కదలికలను కనిపెట్టిన ఎస్సై నిందితులను వెంటాడి పట్టుకోగా కిలోఎండు గంజాయి లభించిందన్నారు. వైఎస్సార్ నగర్ కాలనీకి చెందిన గనిపాక సాయికృష్ణ, బల్లి మధు, టీకులగూడెం గ్రామానికి చెందిన కొట్టె రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై మాచర్ల శ్వేత, చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, తదితరులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్
- బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎంజీఎం/వరంగల్: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం హన్మకొండలో మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలతో పాటు ప్రీతి ఘటనకు నిరసనగా వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి కేఎంసీ వరకు బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు, పార్టీ కార్యకర్తలతో కలిసి బండి సంజయ్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'నిరసన దీక్ష' చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, పార్టీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి భద్రకాళీ దేవాలయం ప్రధానం ద్వారం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పూటకో అత్యాచారం, రోజుకో హత్య జరుగుతున్నా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 11 శాతం నేరాలు పెరిగాయన్నారు

ప్రీతికి ఘన నివాళి

వరంగల్: ఇటీవల ర్యాగింగ్‌తో మృతి చెందిన కేఎంసి విద్యార్థిని డాక్టర్ ప్రీతికి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోతు హుస్సేన్ నాయక్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ప్రీతి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ మద్దతుంటే క్రిమినల్స్ ఏం చేసినా చెల్లుతుందని ప్రీతి ఘటన నిరూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపుపై నేతల ఆగ్రహం



ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో బీజేపీ నేతల వాగ్వాదం

వరంగల్/ఎంజీఎం: మెడికో ప్రీతి ఆత్మహత్య చేసుకున్న మెడికోకు సంతాపం తెలుపుతూ ఆదివారం సాయంత్రం పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి కేఎంసీ వరకు చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను గ్రేటర్ కార్పొరేషన్‌కు చెందిన డీఆర్ఎస్ సిబ్బంది తొలగించారు. ఈక్రమంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బందితో నాయకులు వాగ్వాదానికి దిగారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ కుసుమ సతీష్ మాట్లాడుతూ బీజేపీ అంటే తూర్పు ఎమ్మెల్యేకు భయం పట్టుకుందని, బండి సంజయ్ అంటే రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వణుకు పుడుతోందని ఆరోపించారు.

ఫేర్‌వెల్ వేడుకల్లో 'ఘర్షణ'

- మద్యం తాగిన విద్యార్థులు... చితకబాదిన అధ్యాపకులు

హసన్‌పర్తి: ఫేర్‌వెల్ వేడుకల్లో ఓ ఘటన ఘర్షణకు దారితీసింది. నగరంలోని భీమారం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం స్థానికంగా ఉన్న ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఫెయిర్‌వెల్ వేడుకలు నిర్వహించింది. ఓ వైపు వేడుకలు కొనసాగుతుండగా మరోవైపు పరిసర ప్రాంతంలో కొంత మంది విద్యార్థులు మద్యం సేవించడం ప్రారంభించారు. దీంతో విద్యార్థుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న అధ్యాపకులు అక్కడికి వెళ్లి వారిని మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు అధ్యాపకులపై తిరగబడినట్లు తెలిసింది. దీంతో అధ్యాపకులు వారిని చితకబాదారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న పోలీసులు

పోలీసులకు సమాచారం..

ఫంక్షన్‌హాల్‌లో గొడవ జరుగుతున్నదనే సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. గొడవకు దారి తీసిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా తమ పిల్లలను అధ్యాపకులు కొట్టారనే సమాచారంతో తల్లిదండ్రులు ఫంక్షన్ హాల్‌కు చేరుకుని విషయాన్ని ఆరా తీశారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షుడిగా రాము



హన్మకొండ అర్బన్ : విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గోకారపు రాము ఎన్నికయ్యారు. నగరంలోని సామ జగన్మోహన్ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోతు మహేష్, ఉపాధ్యక్షులుగా బి.సత్యప్రకాశ్, హెచ్.సునంద, ఎం.విజయ్‌కుమార్, పి.కిరణ్, కార్యదర్శులుగా కె.జగన్‌మోహన్‌చారి, ఎం.కృష్ణమూర్తి, సీహెచ్.అరుణ్, ఎల్.కరుణాకర్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జనగామ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్‌గా పి.సత్యం, వి.అజయ్‌కుమార్, కె.రమ, ములుగు జిల్లాకు పి.కుమారస్వామి, బి.వరప్రసాద్, భూపాలపల్లి జిల్లాకు పి.తనుజ రాణి, జగదీష్ ఖన్నా, మహబూబాబాద్ జిల్లాకు ఆర్.శ్రీనివాస్, బి.రమ, బి.పార్థు, కె.చంద్రశేఖర్, హనుమకొండ జిల్లాకు ఎస్.వెంకటనారాయణ, గోపు రవీందర్, వరంగల్ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్లుగా జె.సంపత్, పి.సంపత్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగణేష్‌రెడ్డి, టి.ప్రేమానందరావు, సమ్మిరెడ్డి, బి.కిషన్, వై.శ్రీనివాసులు, సుధ, శ్రీధర్, చంద్రశేఖర్ ఆర్య పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26778]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26776]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26774]

SERVICES

CHANGE OF NAME

■ I, the undersigned THUMMA JYOTHI, Wo. Gade Bhupal Reddy (New Name) Previously called GADE JYOTHI, Wo. Gade Bhupal Reddy (Old Name) Residency at H.No. 6-2-8/53/A, Dattam Reddy Nagar, Kallem Road, Jangaon, Jangaon District- 506167, Telangana State India and solemnly declare. [W-775843]

LOANS

■ బాలాజీ కన్సల్టెంట్: (IT రిటర్న్, GST, పాన్‌కార్డ్) చేయబడును. బిజినెస్ లోన్స్, మార్టిగేజ్, పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. సంప్ర॥ 85228 25358, 97014 32393. [M-1190583]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

CONSULTANT

■ Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24, 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

WANTED

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive / Delivery Executive, 2) Accounts Executive Relevant experience is mandatory Age 20-35 yrs, Cont: 8106112401. [W-775840]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఇంట్లో 24 గం॥లు వృద్ధున్ని చూసుకోవడానికి ఇంటిపనికి పురుషులు కావలెను. జీతం: 15 వేలు, ఫ్రీ వసతి +భోజనం. సంప్ర॥ సెల్: 9848652107 [Y-784319]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిటిచేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర: 93919 94780. [L-521]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

■ సెం.సూపర్ వైజర్స్ - 17000/-, సెం.గార్డ్స్ - 14000/- మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా బాలానగర్, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్. Q: 10th Degree, మెట్రో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఫోన్ 9885657755 [H-792981]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

■ అన్నపూర్ణ హోమ్ కేర్ Govt Reg:లో బేబీ కేర్, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. Ph: 9390427694 [H-778974]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాలకు వెళ్లి అనంతలోకాలకు..

- ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం
- మృతుడు శివనగర్ వాసి



ప్రదీప్‌చౌదరి (ఫైల్)

మామునూరు: మసక చీకట్లోనే గేదె పాలు తెస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లిన ఓ వ్యక్తి అనంత లోకాలకు వెళ్లాడు. ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్టాప్ వద్ద చోటు చేసుకుంది. మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి గుంటూరుపల్లికి చెందిన బొట్ల రమాదేవి, మల్లికార్జున్ దంపతుల కుమారుడు ప్రదీప్ చౌదరి(28) శివనగర్ పల్లవి ఆస్పత్రి ఏరియాలో భార్య, మూడేళ్ల కుమార్తెతో కలిసి నివాసం ఉంటూ పాలు,పెరుగు వ్యాపారం చేస్తున్నాడు. ప్రదీప్ చౌదరి బైక్‌పై ప్రతిరోజు ఉదయం 5 గంటలకు సంగెం మండలం గుంటూరుపల్లికి వెళ్లి గేదె పాలు తెస్తుంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం 5 గంటలకు గుంటూరుపల్లికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో గవిచర్ల రోడ్డుపై రాంగోపాలపురం బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రదీప్‌చౌదరికి తలకు బలమైన తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108 వాహనంలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. ప్రదీప్ మృతితో గుంటూరుపల్లి, శివనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించారు. మృత్యువుకు కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని రైల్వే ఉద్యోగి మృతి

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ రైల్వే డీజిల్ షెడ్‌లో టెక్నీషియన్-3గా పనిచేస్తున్న ఉద్యోగి ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రం నలంద జిల్లాకు చెందిన రవికుమార్ సిన్హా (26) దాదాపు 8 నెలల కింద వివాహం చేసుకున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒంటరిగానే ఇంట్లో ఉంటూ విధులకు హాజరై వెళ్లివస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదుగానీ రవికుమార్ సిన్హా ఆత్మహత్యకు పాల్పడ్డాడని, భార్య, బంధువులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

డివైడర్ ఢీకొని ఒకరు..

మరిపెడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మహబూబాబాద్ రోడ్డులోని డివైడర్‌ను ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ఇద్దరు యువకులు బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ క్రమంలో గుగులోతు లాలు(41) అక్కడికక్కడే మృతి చెందగా సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింహులపేట మండలం జయపురం గ్రామం శివారు దాసుతండాకు చెందిన వీరు మరిపెడలోని ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



లాలు మృతదేహం

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..

సంగెం/కాశిబుగ్గ : ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సీహెచ్. పరశురాములు తెలిపారు. ఆదివారం ఉదయం వరంగల్–విజయవాడ డౌన్ లైన్‌లో 391/22-24 కిలోమీటర్ వద్ద చింతలపల్లి, ఎల్గూర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడంతో 25 నుంచి 30 ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడన్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ లేత గులాబీ రంగు పుల్ షర్ట్ దానిపై బ్లూ కలర్ నైలాన్ జాకెట్ ధరించి ఉన్నాడు. నలుపురంగు తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు గుండ్రని ముఖం, ఎరుపురంగు ఐదున్నర అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడన్నారు. మృతునివద్ద బ్లాక్ కలర్ గ్లోనీ కంపెనీ ఫోన్ అందులో ఎన్‌సెల్ సిమ్, నేపాల్ రూ.20 నోట్ దొరికినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా తెలిస్తే వరంగల్ రైల్వే ఎస్సై 9866330257, 9440627532 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

విద్యుదాఘాతంతో వ్యక్తి..

డోర్నకల్ : మండల శివారులో చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం శివారు రేకులతండాకు చెందిన దారావత్ కృష్ణ(46) మండలంలోని ముల్కలపల్లి శివారులోని ఆకేరువాగులో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై శ్యాంసుందర్‌ను వివరణ కోరగా మృతుడు చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతదేహం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటన జరిగిన ప్రదేశం డోర్నకల్ మండల పరిధిలో ఉండటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

మహాముత్తారం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోర్లగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ..మండలంలోని బోర్లగూడెంకు చెందిన గుంజ సరోజన (55) భర్త వెంకటయ్య మద్యానికి బానిసై కుటుంబ బాధ్యత మరిచి పట్టించుకోకపోవడంతో పలు మార్లు భర్తను మందలించింది. అయినప్పటికీ భర్తలో మార్పు రాకపోవడంతో కుటుంబపోషణ భారమై మనస్తాపానికి గురైంది. దీంతో శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తూరులో వివాహిత..



అనూష మృతదేహం

తొర్రూరు రూరల్ : ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుర్తూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసర్ల అనూష (30) పెళ్లి చేసుకొని ఏళ్లు గడుస్తున్నా సంతానం కావడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలానగర్‌కు చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏఎస్ఎం మహిళా డిగ్రీ కళాశాల రోడ్డుకు చెందిన యువతి సుమశ్రీ కాలేజీకి వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించడం లేదు. దీంతో ఆదివారం సాయంత్రం యువతి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.